క్లుప్తంగా

వైద్య శిబిరానికి స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆమనగల్లు: ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండలంలోని ఆకుతోటపల్లి గ్రామ పరిధి గౌరారంలో సోమవారం బొచ్చుపల్లి రాకేశ్‌రావ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కామినేని హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో అవసరమైన వారికి వివిధ ఆరోగ్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వినోద్‌రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారికి
కండువా కప్పి ఆహ్వానిస్తున్న యాదయ్య

యాచారం: వివిధ పార్టీలకు చెందిన ధర్మన్నగూడెం కార్యకర్తలు, నాయకులు పలువురు సోమవారం సీపీఎంలో చేరారు. పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ ఆధ్వర్యంలో.. ఇబ్రహీంపట్నంలో పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య సమక్షంలో 20 మంది చేరగా.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. పేదల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న పార్టీ సీపీఎంకు ప్రజల్లో ఆదరణ తగ్గలేదన్నారు. పార్టీలో చేరిన వారిలో ఆనంద్, మధు, యాదయ్య, నర్సింహ ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.అంజయ్య, జంగయ్య, చందునాయక్, బాలరాజ్, శ్రీమన్నారాయణ, తావునాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి.. ఆకర్షితులై

- కాంగ్రెస్‌లో పెరుగుతున్న చేరికలు
- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



పార్టీలో చేరిన వారికి కండువాలు
కప్పి ఆహ్వానిస్తున్న కేఎల్లార్

కందుకూరు: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరికలు పెరిగాయని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దాసర్లపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు జంబుల శివరాంరెడ్డితో పాటు పలువురు కేఎల్లార్ సమక్షంలో అధికార పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం కేఎల్లార్ మాట్లాడారు. ఫ్యూచర్‌సిటీతో మహేశ్వరం నియోజకవర్గాన్ని మహానగరంగా అభివృద్ధి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలిసి బహుమతిగా ఇద్దామన్నారు. భవిష్యత్ తరాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఎస్.వెంకట్రామ్‌రెడ్డి, డైరెక్టర్లు కె.యుగంధర్‌గౌడ్, పాండురంగారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు అనుమతి తీసుకోవాలి

సీఐ పవన్‌కుమార్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: దీపావళి పండుగ సందర్భంగా మండల, మున్సిపల్ పరిధిలో టపాకాయల దుకాణాలు నెలకొల్పేవారు తప్పనిసరిగా సంబంధిత పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలని సీఐ పవన్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. తాత్కాలిక టపాకాయల అమ్మకాల కోసం అనుమతులు కోరేవారు తప్పనిసరిగా ఈ నెల 16వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముందస్తు అనుమతులు లేకుండా తుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాణాల ప్రకారం నిబంధనలు పాటించని దరఖాస్తులు తిరస్కరించబడతాయని తెలిపారు. మరిన్ని వివరాల కోసం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించవచ్చన్నారు. టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేసేవారు నిబంధనలను పాటించాలని తెలిపారు.

దేవాలయ అభివృద్ధికి విరాళం

షాద్‌నగర్: పట్టణంలోని శ్రీ సత్యసాయి దేవాలయ అభివృద్ధికి ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చింహోడ్ గ్రామానికి చెందిన దేశ్‌ముఖ్ అరుంధతి సోమవారం రూ.1 లక్ష విరాళం అందజేశారు. శ్రీ సత్యసాయి జయంతిని పురస్కరించుకొని దేవాలయంలో కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న అరుంధతి నిర్వాహకులకు విరాళం అందజేశారు.

ముంచెత్తింది



తెగులు సోకిన పత్తి చేను

అధిక వర్షాలు పత్తిరైతులను అతలాకుతలం చేశాయి. ఎన్నో ఆశలతో తెల్లబంగారం పండించిన వారిని.. కుదేలు చేసింది. దిగుబడిరాక, పెట్టుబడి కోల్పోయి నష్టాల్లో ముంచెత్తింది.

- విస్తారంగా వర్షాలు
- నల్లబడిన తెల్లబంగారం
- నష్టపోయిన పత్తి రైతులు

మంచాల: ఈ ఏడు కురిసిన భారీ వర్షాలు.. పత్తి పంటలను దెబ్బతీసింది. రైతును నట్టేట ముంచెత్తింది. పెట్టుబడి సైతం తుడిచిపెట్టుకుపోయింది. మండలంలో సాధారణంగా పంట విస్తీర్ణం 14వేల 200 ఎకరాలు. అందులో పత్తి 3 వేలు, వరి 6వేల 700, జొన్న 2 వేలు, ఉద్యాన పంటలు 2వేల 200 ఎకరాల్లో సాగు చేశారు.

తేమ ఎక్కువై..

గడిచిన నెలక్రితం వరకు కురిసిన ఎడతెరపి లేని వానలతో పత్తికి 15శాతం తెగులు సోకింది. ఆకులు ఇనుప రంగుకు మారి కాత, పూత దెబ్బతిన్నది. దీంతో దిగుబడిపై ప్రభావం పడింది. తెగులు నివారణకు మందులు పిచ్చికారీ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. మధ్యలో కాస్త వరుణుడి శాంతించినా.. మరలా ఉరుమడంతో చేతికి వచ్చిన పంట నీటిపాలైంది. ఏరడానికి సిద్ధంగా ఉన్న పంట సైతం నల్లబడిపోయింది. భూమిలో తేమ అధికమై తెగులు మరింత విస్తరించింది. ఇనుప తెగులు సోకడమే కాకుండా, చెట్లు ఎండిపోయాయి. మండలంలో 45 శాతం పంట దెబ్బతిన్నది.

పూత దశలో..

కాత, పూత దశలోనే పంటకు తెగులు సోకడంతో రైతుల ఆశలు నిరాశగా మారాయి. కొన్ని చోట్ల పంట చేతికి వచ్చే దశలో కురిసిన వర్షాలతో నేలపాలైంది. ఏ మాత్రం దిగుబడి వచ్చేలా లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడితో పాటు.. శ్రమను కోల్పోయామని వాపోతున్నారు. ఎకరాకు రూ.10 నుంచి 12 వేల వరకు వెచ్చించామని పేర్కొంటున్నారు.

ఆదుకోవాలి



రెండున్నర ఎకరాల్లో పత్తి సాగు చేశాను. వర్షాల కారణంగా పంటకు తెగులు సోకింది. ఏమాత్రం దిగుబడి చేతికి రాలేదు. పెట్టుబడి పోయి, అప్పు మిగిలింది. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– గోగిరెడ్డి చంద్రారెడ్డి, రైతు, ఆరుట్ల

మెగ్నీషియం లోపించి..



పత్తికి తెగులు సోకింది. అధిక వర్షాలతో మరింత పెరిగింది. మెగ్నీషియం లోపించి, ముదురు ఆకులు ఎరుపు రంగుకు మారుతాయి. ఈనెలు మాత్రం ఆకుపచ్చగానే ఉండి, మిగతా భాగం ఇటుక ఎరుపు రంగుకు మారుతుంది. తెగులు నివారణకు మెగ్నీషియం సల్ఫేట్ 10 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అలా పది రోజుల వ్యవధిలో రెండు సార్లు చేయాలి.

–జి.వెంకటేశ్, మండల వ్యవసాయ అధికారి

కార్మికులను పర్మినెంట్ చేయాలి

- కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలి
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

తుర్కయంజాల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. కార్మికులను పర్మినెంట్ చేసి, పనికి తగిన వేతనం చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 14,15 తేదీల్లో తుర్కయంజాల్, నీలం సంజీవ రెడ్డినగర్‌లోని చలసాని కల్యాణ మండపంలో నిర్వహించనున్న తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర 5వ మహాసభల ఏర్పాట్లను సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. ఈ మహాసభల్లో కార్మికుల సమస్యలపై చర్చించనున్నామని తెలిపారు. మున్సిపాలిటీల్లోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, పార్ట్ టైం, ఫుల్ టైం కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. 2వ పీఆర్సీని ప్రకటించి, కనీస వేతనం రూ.26 వేలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సెలవులు, వారాంతపు సెలవులను అమలు చేయాలని పేర్కొన్నారు. చేపట్టనున్న సభలకు కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.చంద్ర మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్, డి.జగదీష్, జిల్లా కమిటీ సభ్యులు ఇ.నరసింహ, టి.నరసింహ, ఎల్లేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణకు టీకా తప్పనిసరి

- పశు వైద్యాధికారి ఆనందరెడ్డి
- రేపటి నుంచి నవంబర్ 14 వరకు కార్యక్రమం

ఇబ్రహీంపట్నం రూరల్: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తగా టీకా వేయించాలని ఎల్మినేడు ప్రభుత్వ పశువైద్యాధికారి ఆనందరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు టీకా కార్యక్రమం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఐదు పశువైద్య బృందాలు మండల పరిధి గ్రామాలకు వెళ్లి టీకా వేస్తారని, పశుపోషకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. గాలికుంటు వ్యాధి వలన 15 శాతం పాల దిగుబడి తగ్గుతుందని, పునరుత్పత్తికి కూడా నష్టం జరుగుతుందన్నారు. వ్యాధి సోకిన పశువు.. జ్వరం, చొంగ కారడం, నోట్లో, గిట్టల్లో పుండ్లు ఏర్పడి మేత మేయవని, దూడల్లో మరణాలు సంభవిస్తాయని వివరించారు. పశుసంపద వ్యాధి బారిన పడకుండా టీకా తప్పని సరిగా వేయించాలని సూచించారు.

ఎక్కడ.. ఎప్పుడు?

ఈ నెల 15న ఎల్మినేడు, రాయపోల్, కొంగరకలాన్, ఇబ్రహీంపట్నంలో టీకా కార్యక్రమం ఉంటుంది. 21న బొంగ్లూర్, శేరిగూడ. 22న బొంగ్లూర్, శేరిగూడతో పాటు చర్లపటేల్‌గూడ, పోల్కంపల్లి. 23న ఆదిబట్ల, శేరిగూడ. 24న సీతారంపేట్, ఆదిబట్ల, చర్లపటేల్‌గూడ, పోల్కంపల్లి. 27న కర్ణంగూడ, ముకునూర్, మంగళ్‌పల్లి. 29న తుర్కగూడ, ముకునూర్, మంగళ్‌పల్లి, ఖానాపూర్. 30న తుర్కగూడ, నాగన్‌పల్లి, ఉప్పరిగూడ, గోశాల. నవంబర్ 3న కప్పపహాడ్, దండుమైలారం, పోచారం. నవంబర్ 6న తులేకలాన్, దండుమైలారం, రాందాస్‌పల్లి. నవంబర్ 10 నుంచి 14 వరకు మిగిలిన పశువులకు టీకా వేయనున్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవమైనది



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ

మంచాల: ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైనదని ఎంఈఓ రాందాస్ అన్నారు. సోమవారం మండల కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దాలని సూచించారు. ప్రభుత్వ సహకారంతో పాఠశాలల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. అనంతరం మండల స్థాయికి ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులను శాలువా కప్పి, జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, సూపరింటెండెంట్ అజీమ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు యాదగిరి, కిషన్ చౌహాన్, వెంకటేశ్, జావిద్, శ్రీకాంత్, అజ్మత్ ఖాన్, శ్రీనివాస్, శివకుమార్, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

50 శాతం రాయితీపై సాగు పరికరాలు

మంచాల: రైతులకు రాయితీపై ప్రభుత్వం 2025 ఏడాదికి వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద 50శాతం రాయితీతో సాగు పరికరాలను అందజేయనుందని మండల వ్యవసాయాధికారి జి.వెంకటేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరికరాలు.. మొక్కజొన్న నూర్పిడి యంత్రం-1(జనరల్). గడ్డి కట్టే యంత్రాలు- 3 (వాటిలో జనరల్-2, ఎస్సీకి-1). పవర్ వీడర్-1 (జనరల్). బ్రస్ కట్టర్-3 (జ -2, ఎస్సీకి-1). పవర్ టీల్లర్-1(జ). రోటవేటర్- 8 (జ-6, ఎస్సీ-1, ఎస్టీ-1). సీడ్, ఫర్టిలేజర్ డ్రిల్- 2 (జ). ట్రాక్టర్ లాగు పరికరాలు- 12 (జ-9, ఎస్సీ-2, ఎస్టీ-1). బ్యాటరీ స్ప్రేయర్లు- 165 (జ-124, ఎస్సీ- 26, ఎస్టీ-15). పవర్ స్ప్రేయర్లు-28 (జ-21, ఎస్సీ-4, ఎస్టీ-3) చొప్పున ఇవ్వనున్నామని పేర్కొన్నారు. కావల్సిన రైతులు దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ కార్డు, భూమి పాస్ బుక్, ట్రాక్టర్ ఆర్‌సీ బుక్ జిరాక్స్ ఇవ్వాలని సూచించారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు.. స్థానిక రైతువేదిక భవనాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులకు దరఖాస్తులు అందజేయాలని కోరారు.

వరద తగ్గి.. మురుగు నిలిచి

మీర్‌పేట: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మిథులానగర్‌లోని వీధులు బురదతో కంపు కొడుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ కాలనీ పూర్తిగా ముంపునకు గురైన విషయం తెలిసిందే. ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టినప్పటికీ వీధుల్లోని మురుగు మాత్రం అలాగే ఉండిపోవడంతో కాలనీవాసులు ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. మున్సిపాలిటీ వారు బురదను తొలగించకపోవడంతో దుర్వాసనతో అవస్థలు పడుతున్నామని, కొందరు యజమానులు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిపోయారని స్థానికులు తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న దృష్ట్యా కార్పొరేషన్ యంత్రాంగం స్పందించి వెంటనే వీధుల్లోని బురదను తొలగించి బ్లీచింగ్ చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



మిథులానగర్ చర్చి వీధిలోని
ఇళ్ల ఎదుట నిలిచిన బురద

శిబిరం చేపట్టి.. అవగాహన కల్పించి



సిరిగిరిపురంలో విద్యార్థుల క్యాంపు

- ప్రజలను చైతన్య పరుస్తున్న ఎన్ఎస్ఎస్
- ప్రజాసేవలో స్కీం వలంటీర్లు
- పచ్చదనం, పరిశుభ్రతపై ర్యాలీలు

మహేశ్వరం: విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు సమాజ సేవ, క్రమ శిక్షణతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా కార్యాచరణ చేపట్టేందుకు జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ఎంతగానో దోహద పడుతుంది. అందులో భాగంగా ఏదైనా ఒక గ్రామంలో వారం రోజుల పాటు శిబిరం ఏర్పాటు చేస్తారు. అక్కడి ప్రజల స్థితిగతులను తెలుసుకుంటారు. అనంతరం వారిని చైతన్యపరిచేలా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, సదస్సులు,నాటికలు నిర్వహిస్తారు. పచ్చదనం, పరిశుభ్రత, మొక్కలు నాటి సంరక్షించడంతో కలిగే ప్రయోజనాల గురించి వివరించడమే స్కీం వలంటీర్ల లక్ష్యం. పది రోజులుగా మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో పాటు నగరానికి చెందిన ఇందిర ప్రియదర్శిని కళాశాల విద్యార్థులు మండల సిరిగిరిపురం, తుమ్మలూరు, మన్సాన్‌పల్లి, ఎన్టీతండా, డీజీ తండాలలో క్యాంపులు నిర్వహించి ప్రజలను చైతన్యపరిచారు.

నాటికల ద్వారా సందేశం

కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యా ప్రయోజనాలు వివరిస్తూ, బడీడు పిల్లలను బడికి పంపాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. స్వశక్తి సంఘాల మహిళలు సైతం అక్షర జ్ఞానం నేర్చుకునేందుకు అవకాశాలను వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణ చేపట్టాలని సూచించారు. పచ్చదనం, పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటామని చెబుతున్నారు. నశాముక్త్ భారత్ కార్యక్రమం ద్వారా యువత మత్తు బారిన తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి నాటికల ద్వారా సందేశం ఇచ్చారు. క్యాంపునకు డీసీపీ సునీతారెడ్డిని ఆహ్వానించి, సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు తీసుకోవడం వలన కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు.

చదువు విలువ తెలిపాం



సిరిగిరిపురంలో క్యాంపు నిర్వహించాం. నిరక్షరాస్యత వలన కలిగే నష్టాలను వివరించాము. అదే సమయంలో విద్య ప్రాముఖ్యతను ప్రజలకు తెలిపాం. ప్రభుత్వ పాఠశాలలు, ప్రాంగణాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాం. – మనీష, బీకాం ద్వితీయ సంవత్సరం

భవిష్యత్తుపై భరోసా



మత్తు పదార్థాలు(డ్రగ్స్, గంజాయి, ఆల్కాహాల్)కు దూరంగా ఉండాలని యువతకు అవగాహన కల్పించాం. వినియోగిస్తే కలిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలను వివరించాం. సమాజం ఎలా గుర్తిస్తో పేర్కొంటూ.. భవిష్యత్తుపై భరోసా కల్పించాం. – శైలజ, బీఏ, ఫైనల్

చైతన్యపరిచాం..



సిరిగిరిపురం శిబిరంలో.. విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు.. ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. తద్వారా విద్యారులు.. ప్రజలతో మాట్లాడడం, నాయకత్వ లక్షణాలపై లోతుగా తెలుసుకున్నారు. క్యాంపు ద్వారా చాలా నేర్చుకున్నారు. మరిన్ని క్యాంపులు నిర్వహిస్తాం.

– డా.జాహెదా బేగం, స్కీం ప్రోగ్రాం అధికారిణి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహేశ్వరం

మౌలిక వసతుల కల్పనకు కృషి



ఐమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న జీపీ సిబ్బంది

కడ్తాల్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఎమ్మెల్యే కసిరెడ్డి సహకారంతో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.1.50 లక్షలతో ఐమాస్ట్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయగా.. సోమవారం పంచాయతీ సిబ్బంది ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నిరంతరం పాటు పడుతున్నారని తెలిపారు. ఆయన సహకారంతో మండలంలో రహదారుల విస్తరణ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల ఏర్పాటు, సీసీరోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, మరమ్మతులు, క్రీడా మైదానాల అభివృద్ధి, శుద్ధ తాగునీటి సరఫరా తదితర కార్యక్రమాలను చేపట్టనున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్, నాయకులు రాజేందర్‌గౌడ్, యాదయ్య, వెంకటేశ్, బుచ్చయ్య, చెన్నమోని కృష్ణ, రాఘవేందర్, చందు, బుద్ధురామ్, తిరుమలేశ్ తదితరులు ఉన్నారు.

సీజేఐపై దాడికి యత్నం అమానుషం



మాట్లాడుతున్న రాజేశ్వరరావు

విశ్రాంత శాస్త్రవేత్త రాజేశ్వరరావు


మీర్‌పేట: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి అమానుషమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని విశ్రాంత శాస్త్రవేత్త జి.రాజేశ్వరరావు అన్నారు. ఆదివారం రాత్రి మీర్‌పేట గాయత్రీనగర్‌లోని సమతా భవన్‌లో న్యాయవాదులు, డిప్యూటీ కలెక్టర్లు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి సీజేఐపై దాడిని ఖండించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ.. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు సీజేఐకే రక్షణ లేకపోతే సాధారణ పౌరుల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. దేశంలో నిత్యం ఎక్కడో ఓ చోట బలహీన వర్గాలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, దాడులను ఎదుర్కొనేందుకు దళిత బహుజన సంఘాలు, వామపక్ష ఉద్యమ సంఘాలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. సీజేపై దాడిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు నిర్వహించాలన్నారు. సమావేశంలో లోకాయుక్త స్టాండింగ్ కౌన్సిల్ జి.సత్యనారాయణయాదవ్, డా.వెంకటేశ్వర్లు, డా.సత్తయ్య, గావరాజు, న్యాయవాదులు విబూది వెంకటేశ్వర్లు, సామ్రాట్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి

షాద్‌నగర్: ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సారి రైతులు ఎక్కువ మంది మొక్కజొన్న పంటను సాగు చేసినట్లు తెలిపారు. దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఉందని, ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి నేరుగా మొక్కజొన్నలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పంట చేతికి వచ్చిన రైతులు తక్కువ ధరకు దళారులకు అమ్ముకుంటున్నారన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి సరైన మద్దతు ధర చెల్లించాలన్నారు.

ఆశలపల్లకిలో..

- అయోమయంలో ఆశావహులు
- రిజర్వేషన్లు మారినా.. జనరల్‌పై ధీమా
- పోటీకి సిద్ధమవుతున్న నేతలు
- గ్రామాల్లో పాగా.. ప్రజల సేవలో పరుగు



ఇబ్రహీంపట్నం: స్థానిక ఎన్నికలపై నోటిఫికేషన్, రిజర్వేషన్ల ప్రక్రియతో ఆశావహుల్లో చిగురించిన ఆశలపై న్యాయస్థానం నిర్ణయం.. నీళ్లు చల్లినట్లు అయింది. అయినా వారిలో ఆశలు అడుగంటలేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని.. రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేసి, ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయగా.. తమ రాజకీయ భవితవ్యాన్ని పరీక్షించుకోవాలని రెండేళ్లుగా ఎదురు చూస్తున్న వారిలో ఆతృత పెరిగింది.

ప్రతిపక్షాల సమాయత్తం

స్థానిక ఎన్నికల ప్రకటనకు ముందుగానే బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎంలు పోరుకు సమాయత్తమయ్యాయి. అందుకు అనుగుణంగా మండలాల వారీగా సమావేశాలను నిర్వహించి, పార్టీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ కొంత వెనుకబడి ఉందని చెప్పవచ్చు. విందు రాజకీయాలు చోటుచేసుకున్నాయి. ఈ తరుణంలో ప్రకటన వెలువడటం, రిజర్వేషన్లపై కోర్టు స్టే ఇవ్వడం వారిని కుంగదీసింది. ఆరు వారాల పాటు ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

రిజర్వేషన్లు మారితే..

కోర్టు తీర్పు ఎలా ఉన్నా.. బీసీ రిజర్వేషన్లు మారితే జనరల్‌కు ఆయా స్థానాలు మారుతాయని, అప్పుడు ఆ స్థానాల్లో పోటీ చేసే అవకాశం తమకు ఉంటుందనే ఆశతో పలువురు ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల అదేవిధంగా ఉండవచ్చని, మారితే బీసీ రిజర్వేషన్ల మాత్రమే కదానే ఆలోచనలో కొందరున్నారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్ పదవులను ఆశిస్తున్న వారు బీసీ రిజర్వేషన్లు తగ్గితే ఆయా స్థానాలు జనరల్, మహిళ స్థానాలుగా మారుతాయని, వాటిల్లో పోటీ చేసే అవకాశం తమకు ఉంటుందనే ఆశతో చాలామంది ఉన్నారు.

మచ్చిక చేసుకుంటున్న నేతలు

పల్లెపోరు నేపథ్యంలో ప్రజలను ఆకట్టుకునే పనిలో నేతలు ఉన్నారు. పర్వదినాలను పురస్కరించుకొని తమకు తోచిన విధంగా వారికి సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఏదిఏమైనా త్వరలో ఎన్నికలు జరుగుతాయన్న విశ్వాసంతో నేతలున్నారు. ఆశావహుల అవకాశాన్ని వారి అనుచరులు సొమ్ము చేసుకుంటున్నారు.

కొంత ఊరట

స్థానిక పోరు నేపథ్యంలో నాయకులు తమదైన శైలిలో తమ అనుయాయులను చేరువ చేసుకొని, గెలుపు వ్యూహాలను రచిస్తున్నారు. అందుకు అవసరమైన డబ్బులను సైతం వెచ్చిస్తున్నారు. అయితే రిజర్వేషన్లపై కోర్టు స్టే.. వారిని అధఃపాతాళానికి తొక్కేసినట్లయింది. కాగా.. రిజర్వేషన్లు అనుకూలంగా రాని వారు తొలుత నిరాశకు లోనుకాగా.. కోర్టు ఆదేశాలు వారికి కొంత ఊరట కలిగించాయి.